



కల్హేర్ సమీపంలోని నల్లవాగులో పారుతున్న వరద



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

గారకుర్తితోపాటు నాలుగు మండలాల

రోడ్లకు రూ.40 కోట్లు

- మంత్రి సీతక్కకు ప్రతిపాదనలు అందజేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 22 : సంగారెడ్డి నియోజకవర్గంలోని కొండాపూర్ మండలం గారకుర్తితోపాటు నాలుగు మండలాల పరిధిలోని ప్రధాన రహదారుల మరమ్మతుల కోసం రూ.40 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసినట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను సోమవారం నాడు ఆయన కలిసి ప్రతిపాదనలు అందజేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలోని అన్ని ప్రధాన రహదారులను బాగు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని కొండాపూర్ మండలం గారకుర్తితో పాటు సంగారెడ్డి, సదాశివపేట, కంది మండలాల పరిధిలోని అన్ని ప్రధాన రహదారులకు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే కొండాపూర్ మండలం గారకుర్తి నుంచి అలియాబాద్ మీదుగా 9 కిలోమీటర్ల రహదారి మరమ్మతు కోసం రూ.10 కోట్లు, హరిదాస్‌పూర్ నుంచి వెంకటేశ్వర ఆలయం వరకు 3.2 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.50 కోట్లు అవసరముందన్నారు. మునిదేవునిపల్లి నుంచి గడిమల్కాపూర్ వరకు 2.20 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.50 కోట్లు, సదాశివపేట మండలంలోని ఏటిగడ్డసంగెం నుంచి మాలపహడ్ వరకు 3 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.2.50 కోట్లు, మద్దికుంట వడ్డెర వీధి నుంచి యావాపూర్ (వికారబాద్ రోడ్డు) వరకు 3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.50 కోట్లు, సంగారెడ్డి శివారు నుంచి తాళ్లపల్లి ఫిల్టర్‌బెడ్ వరకు 1.50 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.35 కోట్లు, ఇస్మాయిల్‌ఖాన్ పేడబ్యాడీ రోడ్డు నుంచి దాసుగడ్డతాండా వరకు 2 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.80 కోట్లు, సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డు నుంచి మహమ్మద్ షాపూర్ మీదుగా ఫసల్‌వాది తండా వరకు 2.20 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.1.85 కోట్లు, కంది మండలంలోని 65 నంబరు జాతీయరహదారి నుంచి చిమ్నాపూర్ తాండా వరకు 7 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.10 కోట్లు, చిమ్నాపూర్ నుంచి చిమ్నాపూర్ తండా వరకు 1 కిలోమీటరు రోడ్డుకు రూ.1 కోటి, కలివేముల నుంచి మక్తాఅల్లూరు వరకు 2 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.1.80 కోట్లు, కవలంపేట నుంచి చేర్యాల తండా వరకు 2.50 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.2.20 కోట్లు ప్రతిపాదనలు మంత్రి సీతక్కకు అందజేసినట్లు జగ్గారెడ్డి వివరించారు.



సింగూరు ప్రాజెక్టు

సింగూరు, నల్లవాగులో జలసవ్వడి

పుల్‌కల్/కల్హేర్, జూలై 22 : వానాకాలం ప్రారంభమైన అనంతరం తొలిసారిగా సింగూరు, నల్లవాగుకు వరద తాకిడి మొదలైంది. రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలతో సోమవారం సింగూరు ప్రాజెక్టులోకి 1,270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు. ప్రస్తుతం 519.595 మీటర్లకు 13.702 టీఎంసీల నీరు ఉంది. అవుట్ ఫ్లో 391 క్యూసెక్కులుగా నమోదైంది. సింగూరు ప్రాజెక్టుకు ఎగువన మంజీర నది తీర ప్రాంతంలో కురుస్తున్న వర్షానికి మంగళవారం ఉదయం నాటికల్లా మరి కొంత మేరకు వరద నీటి ప్రవాహం వచ్చి చేరే అవకాశం ఉంది. కల్హేర్ సమీపంలోని నల్లవాగుకు వరద పారడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి పారే కాకివాగు కల్హేర్ మహారాజ్ గుడి వద్ద నల్లవాగుతో కలిసి ఉధృతంగా పారుతోంది. ఎగువన ఉన్న నల్లవాగు ప్రాజెక్టులోకి మాత్రం నీరు చేరలేదు.

అధ్యక్షా..


నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

ఉమ్మడి జిల్లాలో సమస్యలెన్నో

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. వివిధ రంగాలకు నిధుల కేటాయింపుల పైనే అందరి దృష్టి నెలకొన్నది. తొమ్మిది నెలల కాలంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరగడంతో ఆ ప్రభావం అభివృద్ధి పనులపై పడింది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలపైనా ఒత్తిడి పెరుగుతోంది. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. వీటన్నింటికీ నిధుల కేటాయింపే ముందున్న పరిష్కారం. గత ప్రభుత్వంలో సీఎం, ఆర్థిక మంత్రి ఇద్దరూ ఉమ్మడి మెదక్ జిల్లా వాసులే కావడంతో నిధుల పరంగా ప్రాధాన్యం ఉండేది. ఆ లోటును అధిగమించేలా మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతోపాటు ఎమ్మెల్యేలూ గట్టిగా పట్టుబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 22

- సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు మోక్షముందా?
- 'కాళేశ్వరం' కాలువల నిర్మాణానికి ఆటంకాలు
- అభివృద్ధి, పరిశ్రమల కోసం నిధులు అవసరం
- మంత్రులపైనే ఆశలు..హామీల పరిష్కారానికి ఎమ్మెల్యేలపై ఒత్తిడి



మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల అభివృద్ధి పనులు ఆర్థిక వనరుల పైనే ఆధారపడి ఉన్నాయి. రైతాంగాన్ని ఆదుకునే సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు మోక్షం కలిగించాల్సిన అవసరం ఉంది. గౌరవెల్లి, గండిపల్లి జలాశయాలు, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల అనుసంధాన కాలువలు పూర్తి చేయాలంటే భారీగా కేటాయింపులు జరగాలి. గజ్వేల్, అందోలు, దుబ్బాక, హుస్నాబాద్, సిద్దిపేట, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలి. ఓ వైపున జాతీయ రహదారుల నిర్మాణం చకచకా సాగుతుంటే పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు చీటికిమాటికీ మరమ్మతులకు గురవుతున్నాయి. రహదారుల నిర్మాణానికి సరిపడా నిధులు విడుదల చేయాలి. గురుకులాలతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థలకు సొంత భవనాలు ఉండేలా చర్యలు చేపట్టాలి. ఉమ్మడి జిల్లాలో చాలా విద్యాసంస్థలు అద్దెభవనాల్లోనే అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. వీటన్నింటికీ పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గాల వారీగా ఇంకా ఎన్నో డిమాండ్లు నెలకొని ఉన్నాయి.



అందోలు



- మెదక్ జిల్లాలో విలీనం చేసిన నియోజకవర్గంలోని అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాలను తిరిగి సంగారెడ్డి జిల్లాలో చేర్చడం
- బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల సాగునీటి పథకాలకు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేస్తేనే లక్ష ఎకరాలకు నీరందుతుంది
- అల్లాదుర్గం- మెటల్‌కుంట రహదారి అభివృద్ధిపై దృష్టి పెట్టడం
- యువతకు ఉపాధి కల్పన కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- అల్లాదుర్గంలో సబ్‌కోర్టు ఏర్పాటు

జహీరాబాద్



- చెరకు క్రషింగ్ కర్మాగారం పునరుద్ధరణకు చర్యలు
- జహీరాబాద్ పట్టణం తోపాటు అన్ని గ్రామాల్లో రహదారుల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి
- నిమ్జ్ భూసేకరణను వేగవంతం చేసి పరిశ్రమల ఏర్పాటును వేగిరం చేయడం
- కోహీర్ మండలం కవేలిలో హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో కోర్సులను ప్రారంభించి వినియోగంలోకి తేవడం
- న్యాల్కల్ మండలంలోని మిర్జాపూర్ (బి)లో 40ఏళ్ల క్రితం ఏర్పాటైన పీజీ కళాశాల అభివృద్ధికి కృషిచేయాలి

సంగారెడ్డి

- సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో రహదారులు, మురుగుకాలువలు అధ్వానంగా మారాయి. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి
- బొబ్బిలికుంట సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉంది
- సంగారెడ్డిలోని బైపాస్‌రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరైనా పనులు సాగడం లేదు
- కుక్కల నియంత్రణకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం
- సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో డంపుయార్డును నిర్మించడానికి నిధులు అవసరం




నారాయణఖేడ్

- నల్లవాగు ప్రాజెక్టు నుంచి వృథాగా పోతున్న నీటిని మళ్లించడం కోసం ప్రాజెక్టు కుడివైపున వరద కాలువను నిర్మిస్తే పది గ్రామాల్లోని దాదాపు 1500 ఎకరాలకు ప్రయోజనం
- నియోజకవర్గంలోని గురుకులాలకు సొంతభవనాలు నిర్మించడానికి నిధులు అవసరం
- పెద్దశంకరంపేటలో విద్యుత్ సమస్యను అధిగమించేలా 133 కేవీ సబ్‌స్టేషన్, మరో రెండు సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- ఉపాధి కల్పనలో భాగంగా ఇక్కడ ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీని అమలు పరచడం
- ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నందున టీచర్ల నియామకంలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

పటాన్‌చెరు

- పటాన్‌చెరు-భానూరు రహదారిని రెండు లైన్లుగా విస్తరించడానికి రూ.100 కోట్ల నిధులు విడుదల చేయాలి
- నియోజకవర్గంలోని ప్రతీ మండలంలోనూ ఒక మినీ స్టేడియంను నిర్మిస్తామనే హామీ
- జాతీయ రహదారిని కలుపుతూ అమీన్‌పూర్ వరకు ప్రతిపాదనల్లో ఉన్న రహదారి నిర్మాణ పనులు చేపట్టడం
- రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ నిధులు మంజూరు కాకపోవడంతో అమీన్‌పూర్ సమీకృత వెజిటేబుల్ మార్కెట్ నిర్మాణానికి ఆటంకం



మెదక్

- ఘన్‌పూర్ ప్రాజెక్టు ఎత్తును పెంచే పనుల్లో జాప్యం
- గత ప్రభుత్వం మెదక్ పట్టణానికి రూ.50 కోట్లు, రామాయంపేటకు రూ.25కోట్లను మంజూరు చేయగా ఆ నిధులను విడుదల చేయాల్సి ఉంది
- మెదక్ పట్టణంలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పూర్తి చేయడం
- మెదక్ నుంచి తిరుపతి, షిరిడీలకు రైలు సౌకర్యం కల్పించడం. రాష్ట్రం నుంచి పంపించే ప్రతిపాదనల్లో చేర్చాలి
- ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాల్సి ఉంది



నర్సాపూర్

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు
- గత ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధులతో చేపట్టిన పనులు నిలిచిపోవడం
- డివిజన్ కేంద్రంగా ఏర్పాటైనప్పటికీ ఆర్‌డీవో కార్యాలయం మినహా మిగతా కార్యాలయాలన్నీ హామీలకే పరిమితం
- నర్సాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిరుపేదలైన అర్హులకు పంపిణీ చేయడంలో జాప్యం



నేరాల అదుపునకు పటిష్ట చర్యలు : ఎస్పీ

తూప్రాన్, జూలై 22: జిల్లాలో నేరాలను అదుపు చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్‌లో పోలీసు సబ్‌డివిజన్ పరిధి నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సోమ వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. నేరాల నియంత్రణ కోసం ఇంతకు ముందు టాస్క్‌ఫోర్స్ ఉపయోగిస్తుండగా, జిల్లాలో ఉన్న సీసీఎస్‌ను స్ట్రాంగ్ చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో మూడు హైవే రోడ్లపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గంజాయి వినియోగంపై కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తూప్రాన్ సబ్ డివిజన్ పరిధిలో జరిగిన నేరాలపై త్వరగా విచారణ పూర్తి చేయాలని సూచించిట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో జేఎల్‌ఎం మృతి

- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా షాక్



గణేష్(ఫైల్)

అల్లాదుర్గం, జూలై 22 : ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు మారుస్తుండగా అకస్మాత్తుగా కరెంటు సరఫరా కావడంతో షాక్ కొట్టి ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మన్ ఒకరు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. అల్లాదుర్గంకు చెందిన తమ్మనగారి గణేష్ జేఎల్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. రాంపూర్ ఫీడర్‌కు సరఫరా అవుతున్న విద్యుత్‌లో అంతరాయం ఏర్పడటంతో స్థానికంగా జేఎస్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణతో కలసి గణేష్ మరమ్మతులు చేసేందుకు సోమవారం ఉదయం వెళ్లారు. అల్లాదుర్గం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గణేష్ ఫీజు వేస్తుండగా, అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో గణేష్‌కు షాక్ తగిలింది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. అతని తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌కు ఏడుగురు సీఏఎస్‌లు



సీఏఎస్ ఆర్‌ఎంవో రేష్మాఅంజుమ్

సంగారెడ్డి అర్బన్, జూలై 22 : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఏడుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్)లు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో వీరు ఇక్కడికి వచ్చారు. సీఏఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ రేష్మా అంజుమ్ విధుల్లో చేరారు. డా.సంజయ్, డా.శ్రీకాంత్, డా.కపూర్, డా.కృష్ణారావు, మరో ఇద్దరు సీఏఎస్‌లుగా వచ్చారు. జీజీహెచ్‌తో పాటు ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో సీఏఎస్ ఆర్‌ఎంవోలుగా వీరి సేవలు వినియోగించుకోనున్నట్లు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ తెలిపారు.

తిరిగి తిరిగి కాళ్లు సచ్చుబడుతున్నా పరిష్కరిస్తలే

- నా భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించలేదు
- లక్ష రుణానికి రూ. 25వేలు మాఫీ అయ్యాయి
- ప్రజావాణికి అర్జీదారుల మొర
- ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్లు

సంగారెడ్డి రూరల్, జూలై 22 : 'వారసత్వ భూమిని తన పేరున మార్చమని ఐదేళ్లుగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా... తిరిగి తిరిగి కాళ్లు సచ్చుబడిపోతున్నాయే కానీ నా సమస్య పరిష్కరిస్తలే' అని సదాశివపేట మండలం నందికంది గ్రామానికి చెందిన బల్లె లింగయ్య ప్రజావాణికి అర్జీ పెట్టారు.

'ప్రభుత్వం లక్ష రూపాయల లోన్ ఉన్న రైతులకు మాఫీ చేసిందని చెప్పారు కానీ, నాకు రూ.25వేలు మాత్రమే మాఫీ అయ్యిందని బ్యాంకులో చెబుతున్నారు.' అని ప్రజావాణిలో కొండాపూర్ మండలం చెర్లగోపులారం గ్రామానికి చెందిన కిందటి శంకరయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇలా ఒక్కొక్కరు ఒక్కో సమస్యను విన్నవించుకున్నారు. కలెక్టర్ వల్లూరి క్రాంతి అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తమకు ఉపాధి చూపాలని, పింఛన్‌లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని అర్జీలు అందాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మెదక్ జిల్లాలో 136 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, జూలై 22 : మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 136 దరఖాస్తులు రాగా.. ఇందులో అధికంగా భూ సమస్యలపై 36, డబుల్‌బెడ్‌రూంకు సంబంధించి 18 ఫిర్యాదులు వచ్చాయి. పింఛన్ 8, రుణమాఫీ 7, ఇతర సమస్యలపై 67 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవాలని, ఇతరులపై ఆధారపడరాదని సూచించారు. దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఫిర్యాదులను స్వీకరించారు. అర్జిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు.

బదిలీలు ఆలస్యం

- ఈ నెల 31 వరకు ప్రక్రియ పొడగింపు
- మెదక్ జిల్లాలో 340 మందికి స్థానచలనం
- ప్రహసనంలా జోనల్ విధానం
- పలు శాఖలలో బదిలీలకు ఆటంకాలు

మెదక్, జూలై 22 : ఉద్యోగుల సాధారణ బదిలీలు కొనసాగుతుండగా మెదక్ జిల్లాలో ఆయా శాఖలలో 340 మందికి స్థానచలనమైంది. ఈ నెల 16, 17 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 20వ తేదీ రాత్రి వరకు ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు రావాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం ఈ నెల 31 వరకు బదిలీ ప్రక్రియను పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బదిలీలు మరింత ఆలస్యం కానున్నాయి.

సీనియారిటీ జాబితాపై విమర్శలు

ఆయా ప్రభుత్వ విభాగాల్లో సీనియారిటీ జాబితాను రూపొందించగా, నిబంధనల ప్రకారం 40 శాతం మించకుండా సిబ్బందిని బదిలీ చేయాల్సి ఉంది. సీనియారిటీ జాబితాల ప్రకటన తర్వాత అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, తుది జాబితా విడుదలకు సమయం చాలకపోవడంతో బదిలీ ప్రక్రియ ముందుకు సాగలేదు. పలు ప్రభుత్వ శాఖల్లో ప్రకటించిన సీనియారిటీ జాబితాలు హేతుబద్ధంగా లేవనే విమర్శలు వినిపించాయి. రాష్ట్రంలో జోనల్ విధానం ప్రవేశపెట్టిన తర్వాత బదిలీ ప్రక్రియ ఓ ప్రహసనంలా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు. వైద్యారోగ్య, రెవెన్యూ, వ్యవసాయ, ఆర్థిక, కుటుంబ సంక్షేమ శాఖలలో బదిలీలకు ఆటంకాలు ఏర్పడ్డాయని తెలిసింది.

పంచాయతీరాజ్‌లో అత్యధిక బదిలీలు

జిల్లా పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న వారిలో ఎక్కువ మందికి స్థానచలనం కలగనుంది. ఇందులో అత్యధికంగా 146 మంది పంచాయతీ కార్యదర్శులను ముందుగానే బదిలీ చేశారు. నలుగురు సూపరింటెండెంట్లను ట్రాన్స్‌ఫర్ చేశారు. అనంతరం జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న 63 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఇందులో 28 మంది నాలుగో తరగతి ఉద్యోగులు, 12 మంది రికార్డు అసిస్టెంట్లు, 23 మంది జూనియర్ అసిస్టెంట్లతో పాటు నలుగురు సూపరింటెండెంట్లు బదిలీ అయ్యారు. విద్యాశాఖలో ఒక సూపరింటెండెంట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, 8 మంది జూనియర్ అసిస్టెంట్లు, మరో 8 మంది నాలుగో తరగతి ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు అందనున్నాయి.

ఉద్యోగ సంఘాల నేతలకు మినహాయింపు

ఉద్యోగుల సంక్షేమం, హక్కులు సాధనకు గళం వినిపించే ఉద్యోగ సంఘాల నేతలకు ట్రాన్స్‌ఫర్లలో మినహాయింపు కల్పిస్తోంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన టీఎన్జీవో, టీజీవో, నాలుగో తరగతి ఉద్యోగ సంఘాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులకు వర్తిస్తోంది. యూనియన్ ఎన్నికల్లో గెలుపొందిన నాటి నుంచి 8 సంవత్సరాల వరకూ ఒకే చోట పనిచేసే వెసులుబాటు కల్పించారు.

317 జీవోతో ఉద్యోగులకు అవస్థలు



317 జీవో మూలంగా ఉద్యోగులు అనేక అవస్థలపాలు కావలసి వస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఉద్యోగ నిర్వహణ చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం బదిలీల ఉత్తర్వులు వెలువడడంతో వారి కష్టాలు తీరుతాయనుకున్నా అడియాశే మిగిలింది. ఒకే చోట రెండు సంవత్సరాల పూర్తిచేసిన ఉద్యోగులు బదిలీ అర్జీ పెట్టుకునే వెసులుబాటు ఉన్నా ఏ ఒక్క రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరం. 317 జీవో ద్వారా చాలామంది ఉద్యోగులకు న్యాయం జరిగినా, నష్టపోయిన బాధితులూ ఉన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన శాఖల పునర్విభజనలో నీటి పారుదల శాఖలో జోనల్ వ్యవస్థ పూర్తిగా రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ఉంది. ఉద్యోగుల పిల్లల స్థానికతకు భంగం కలిగేలా కనిపిస్తోంది.

-దొంత నరేందర్, టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు

'ఆశా'లకు ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి: సీఐటీయూ

సంగారెడ్డి రూరల్, జూలై 22: ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేసి మాట్లాడారు. 20 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్కీములు పూర్తిస్థాయిలో అమలుచేస్తున్నా నేటికీ కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అనేక రకాలుగా సేవలందించారని గుర్తుచేశారు. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షలను రద్దు చేయాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆశా కార్యకర్తల సమస్యల కోసం చర్చించి వేతనాలు పెంచాలని, లేనిపక్షంలో కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సాయిలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, నాయకులు గంగా, ప్రశాంతి, వీరమణి పాల్గొన్నారు.


సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేస్తున్న ఆశాలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించండి

గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. కార్మికులు గ్రామాల్లో అనేకరకాల పనులు చేస్తూ గ్రామాన్ని అద్దంలా మారుస్తున్నా.. నేటికీ కార్మికులకు కనీస వేతనం అందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుల సత్తయ్య, దశరథ్, నాయకులు శంకర్, వెంకటయ్య, నగేష్, రాములు పాల్గొన్నారు.

రైతు బీమా కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి: ఏవో

మర్కుక్/చిన్నకోడూరు/కోహెడ/ములుగు, జూలై 22: రైతులు తప్పనిసరిగా రైతుబీమా కోసం నమోదు చేసుకోవాలని ఏవో నాగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మర్కుక్ మండలంలోని మర్కుక్, ఎర్రవల్లి, దామరకుంట రైతువేదికల్లో 2024 సంవత్సరానికిగాను రైతుబీమా నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారులు నిర్వహించారు. రైతుబీమా పథకంలో కొత్తగా పట్టాదారు పాసుబుక్కులు వచ్చినవారు, రైతుబీమాలో ఇదివరకు నమోదు కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు గల పట్టాదారులు అర్హులని తెలియజేశారు. రైతుబీమా ఫారం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుబుక్కు జిరాక్స్ జతపరిచి రైతువేదికలో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, అశ్విని, రైతులు పాల్గొన్నారు. 2024 జూన్ 28 లోపు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులందరూ ఆగస్టు 5 లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని చిన్నకోడూరు మండల వ్యవసాయాధికారి జయంత్‌కుమార్ సోమవారం తెలిపారు. రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని కోహెడ ఏఈవో శివకుమార్ తెలిపారు. మండలంలోని వరికోలు రైతువేదికలో సోమవారం రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ములుగు మండల వ్యవసాయాధికారి ప్రగతి కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.


కోహెడ: రైతుబీమా దరఖాస్తును స్వీకరిస్తున్న ఏఈవో శివకుమార్

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

తూప్రాన్, జూలై 22: తూప్రాన్ పట్టణంలో ఫుడ్ ఫాయిజన్ జరిగి పలువురు అస్వస్థతకు గురికావడంతో సోమవారం పలు హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని మండి హోటల్‌లో ఈనెల 16, 17న బిర్యానీ తిన్న పలువురికి ఫుడ్ ఫాయిజన్ జరిగి అస్వస్థతకు గురయ్యారు. సుమారు 20 మంది ఫుడ్ పాయిజన్ బారినపడి ఆస్పత్రుల్లో చికిత్సలు పొందారు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకిరాగా, శనివారం హోటల్‌ను మూసివేశారు. సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తౌర్యానాయక్ తూప్రాన్ పట్టణానికి విచ్చేసి మున్సిపల్ కమిషనర్ ఖాజామొహిజుద్దీన్ ఆధ్వర్యంలో మండి హోటల్‌లో తనిఖీలు చేశారు. ఫుడ్ ఫాయిజన్‌పై పంచనామా నిర్వహించి, హోటల్‌కు తాళం వేశారు. అనంతరం శుభం మెస్, గోల్డెన్ హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మున్సిపల్ మేనేజర్ రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.


తూప్రాన్‌లో హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

'శాంతిసేన'కు ఎంపిక కావడం అభినందనీయం

● రిటైర్డ్ ఇండియన్ ఆర్మీ అధికారి నీల చంద్రం

మర్కుక్, జూలై 22: ప్రపంచంలో ఉన్న పేద దేశాల శాంతిస్థాపన కోసం ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేసే శాంతిసేన కోసం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన జవాన్ బొక్కి వెంకటేష్ ఎంపికకావడం అభినందనీయమని రిటైర్డ్ ఇండియన్ ఆర్మీ అధికారి నీల చంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. బొక్కి ముత్యాలు, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడైన వెంకటేష్ ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వెంటనే ఆజాద్ డిఫెన్స్ అకాడమీ గజ్వేల్‌లో చేరి 18 ఏళ్లలోనే ఆర్మీకి ఎంపికయ్యారు. ఈ మధ్యనే ఆర్మీలో అన్నింటికన్నా కష్టమైన రాష్ట్రీయ రైఫిల్లో అంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్‌లో పాల్గొని వచ్చిన వెంకటేష్.. ఆరునెలలు తిరగకుండానే ఐక్యరాజ్య సమితి పరిధిలో పనిచేసే శాంతిసేనకు ఎంపికకావడం సిద్దిపేట జిల్లాకే గర్వకారణమని చంద్రం పేర్కొన్నారు. అనంతరం వెంకటేష్‌ను ఆజాద్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షఫీతో కలిసి సన్మానించారు.


వెంకటేష్‌ను వాళ్ల అమ్మానాన్నలతో సన్మానిస్తున్న చంద్రం

ఖాతాదారులకు మెరుగైన సేవలు

● సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సోమలింగంగౌడ్

సంగారెడ్డి టౌన్, జూలై 22: ఖాతాదారులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సిటిజన్ కో ఆపరేటీవ్ సొసైటీ బ్యాంకు డైరెక్టర్ సోమలింగంగౌడ్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని సిటిజన్ కో ఆపరేటీవ్ సొసైటీ బ్యాంకులో సోమవారం ఖాతాదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమలింగంగౌడ్ మాట్లాడుతూ ఈ సొసైటీని స్థాపించి 27 ఏళ్లు అయిందని, బ్యాంకు అభివృద్ధికి ఖాతాదారుల సహకారం మరిచిపోలేనిదన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ 42 బ్రాంచీలతో 5 రాష్ట్రాలలో రూ.4 వేల కోట్ల టర్నోవర్‌తో ఇతర బ్యాంకులకు ధీటుగా కొనసాగుతుందని వివరించారు. సభ్యులకు మెరుగైన, నమ్మకమైన సేవలందించడంతో పాటు వచ్చే 2025 నాటికల్లా రూ.5 వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సోమలింగంగౌడ్

గణేష్‌నగర్‌లో రోడ్డు ఆక్రమించి ప్రహరీ

● మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసుల ఫిర్యాదు

సంగారెడ్డి టౌన్, జూలై 22: సంగారెడ్డి మునిసిపాలిటీ పరిధిలోని గణేష్ నగర్‌లో ఓ ప్రైవేటు స్థల యజమాని రహదారిని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని కాలనీవాసులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. గణేష్‌నగర్‌లోకి వెళ్లేందుకు 20 ఫీట్ల రోడ్డు ఉండగా, ఆ రోడ్డును సదరు ప్రైవేట్ స్థల యజమాని నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దు గోడను నిర్మించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సరిహద్దు గోడ నిర్మాణంతో ఎదురెదురుగా వాహనాలు ప్రయాణించేందుకు అవకాశం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మించిన ప్రహరీని తొలగించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.



గుట్టపై నుంచి కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగాలు



మహా సముద్రం రిజర్వాయర్



బయ్యన్న గుట్టలపై వెలసిన హనుమాన్ విగ్రహం, గుట్టపై ప్రతిష్ఠించిన అయ్యప్పస్వామి విగ్రహం



ఉమ్మాపూర్ గుట్టలపై అనాటి బంగారు బావి

పర్యాటకంపై చిగురిస్తున్న ఆశలు

- మహా సముద్రం గండి రిజర్వాయర్‌పై మంత్రి ప్రత్యేక దృష్టి
- ఇటీవల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సందర్శన
- ప్రాచీన నాగరికతకు పుట్టినిల్లు ఇక్కడి బయన్న గుట్టలు
- గుట్టపైన ఆంజనేయస్వామి, అయ్యప్ప ఆలయాలు
- ఈ ప్రదేశాన్ని చూసి సంతోషపడిన మాజీ సీఎం కేసీఆర్

హుస్నాబాద్, జూలై 22: చుట్టూ ఎత్తైన కొండలు.. పచ్చిక బయళ్లు.. సహజ సిద్ధమైన వన సంపద.. మధ్యమధ్యలో సెలయేర్లు.. గుట్టల మధ్యలో సరస్సు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. స్వేచ్ఛగా విహరించే జంతు జాలం.. ఈ ప్రదేశాన్ని చూస్తే ఏదో కొత్త అనుభూతి కలుగుతుంది. ఈ ప్రకృతి సౌందర్యం ఒక్కటే కాదు.. ఆది మానవుని అవశేషాలు..సర్వాయి పాపన్న నిర్మించిన కట్టడాలు.. ప్రాచీన నాగరికతకు అద్దంపట్టే సాజీవ సాక్ష్యాలు ఇక్కడ దర్శనమిస్తాయి.. ఇది సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రానికి ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఉమ్మాపూర్ మహాసముద్రం గండి రిజర్వాయర్ బయ్యన్న గుట్టల్లో దాగి ఉన్న ప్రాచీన సంపద. దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లగా కోరుతున్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ ప్రదేశాన్ని చూసి ఆకర్షితులయ్యారు. ఇది పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని కితాబుఇచ్చారు. కానీ అమలుకు నోచుకోలేదు. ఇటీవల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. అందులో భాగంగా ఇటీవల ఈ ప్రదేశాన్ని సందర్శించారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మూడురోజుల క్రితం మహాసముద్రం రిజర్వాయర్ ప్రాంతాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. దీంతో ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారుతుందని ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రాచీన నాగరికతకు సాక్ష్యాలు

ఉమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న మహాసముద్రం గండికి పక్కనే బయ్యన్న గుట్టల్లో సర్వాయి పాపన్న రాతి గోడ నిర్మించారు. ఈ ప్రాంతంలో చుట్టూ గుట్టలు.. ఈ గుట్టల మధ్య మహాసముద్రం గండి రిజర్వాయర్ చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న ఎత్తైన బయ్యన్నగుట్టల్లో ఆది మానవుని శిలా విగ్రహాలు చూపరులను ఆకర్షిస్తాయి. ప్రకృతి రమణీయత మధ్య గుట్టపైన వెలసిన కోనేరులు, సెలయేరులు వింత అనుభూతిని కలిగిస్తాయి. ఈ గుట్టలపైన పరిసర ప్రాంతంలో వ్యవసాయానికి అనుగుణంగా సారవంతమైన భూమి కూడా ఉంది. ఇక్కడే ఒక పెద్ద సెలయేరు, మూడు కోనేరులు, బంగారు బావిగా పిలవబడే బావి, రాతి కట్టడాలు, ప్రహరీ నిర్మాణాలు దర్శనమిస్తాయి. శిథిలమైన నాటి సాంకేతిక నైపుణ్యతకు ఇవి గుర్తులుగా కనిపిస్తాయి. శిలాతోరణాలు, చిన్న నీటి గుంతలు, ప్రాచీన మానవుడు పూజించిన శిథిలమైన ఆలయాలు, శిలలపై ఆదిమానవుని లిపి, క్రమపద్ధతిలో నిర్మించిన రాతి కట్టడాలు, శిలలను పగుల దీసి సాగునీటికై నిర్మించుకున్న కాలువలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. గుట్ట పైభాగాన హనుమాన్ ఆలయం ఉన్నది.

ఆదిమానవుని అవశేషాలు..

ఈ గుట్టల్లో ఆదిమానవుడు నివసించిన రాతి గుహలు, వారికి సంబంధించిన ఆవశేషాలు ఇక్కడ దర్శనమిస్తాయి. నీరు నిలువ చేసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న రాతి గుంతలు, వంట చేసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న రాతి పొయ్యిలు, రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ప్రాచీనకాలంలోనే నాగరికత ప్రస్ఫుటంగా విలసిల్లిందనడానికి అనేక సాక్ష్యాలు ఉన్నాయని చరిత్రకారులు చెబుతారు. గుట్టపై కొలనులో వెలసిన బంగారుబావి, నాటి సమాజానికి శిథిల గుర్తులుగా నేటికీ కనిపిస్తున్నది.

బయ్యన్న దేవుడు

నాటి కాలంలో సరైన సమయంలో వర్షాలు కురియక పోతే ఈ గుట్టలపై వెలసిన బయ్యన్న దేవుడిని ఆరాధిస్తూ కొలిచేవారని తెలుస్తోంది. ఇప్పటికీ అదే విశ్వాసంతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు సకాలంలో వర్షాలు కురియని పక్షంలో బయ్యన్న దేవుడిని ఆరాధిస్తారు. ఉమ్మాపూర్ చుట్టుపక్క గ్రామాలైన నాగారం, మహ్మదాపూర్, మడద, పోతారం(ఎస్), జిల్లెలగడ్డ, సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట, శివరాంపల్లి, గూడెం, ఆకునూరు, గణపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు వర్షాలు కురిపించాలని వేడుకోవడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఇక్కడి నీరు చాలా పవిత్రమైందని ప్రజలు విశ్వసిస్తారు. మహ్మదాపూర్‌కు చెందిన భక్తులు గుట్టపై బాగాన పదేళ్ల క్రితం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రస్తుతం గుట్టల పైభాగానికి వెళ్లేందుకు మహ్మదాపూర్ నుంచి మిషన్ భగీరథ కోసం ఘాట్ రోడ్డు నిర్మించారు. ప్రతిఏటా శ్రావణ మాసంతో పాటు ఏడాది పొడుగునా ఈ గుట్టల ప్రాంతానికి సందర్శకులు వస్తుంటారు.

వనమూలికలకు నిలయం

బయ్యన్న గుట్టల ప్రాంతంలో రోగనిరోధక వనమూలికలు, వివిధరకాల పండ్ల చెట్లు దర్శనమిస్తాయి. అనేకమంది ఈ ప్రాంతం నుంచి మూలికలు తీసుకెళ్తుంటారు. ఈ గుట్టల పైభాగానికి వెళ్లేటప్పుడు మెలికలు తిరిగిన దారులు, ముళ్లపొదలు, అడవి జంతువుల మధ్య ఉన్న ఈ ప్రాంతం చేరుకోవడానికి దాదాపు నాలుగు గంటల సమయం పడుతుంది. ఖరీదైన గ్రానైట్‌రాయి, పశువుల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న రాతి కట్టడాలు శిథిలమై ఉన్నాయి. ఆనాటి ఆట వస్తువులుగా చెప్పుకునే పచ్చీస గుండ్లు కనువిందు చేస్తాయి. ఇంతటి చరిత్ర ఉన్న ఈ ప్రాంతం చరిత్ర పుటలకెక్కలేదు. ఈ ప్రాంతంపై పురావస్తు శాఖ సైతం పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తుంది.

నాడు కేసీఆర్ సందర్శన

8 ఆగస్టు 2015న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మహాసముద్రం గండి రిజర్వాయర్‌ను సందర్శించారు. దాదాపు రెండు గంటల పాటు ఈ ప్రదేశంలో గడిపారు. ఇది పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని కితాబిచ్చారు. 52 ఏళ్ల క్రితం మహాసముద్రం చెరువుకు పడిన గండిని పూడ్చడానికి రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించాడు. సీఎం హామీ మేరకు ఈ పనులకు రూ.3.87 కోట్లు మంజూరు చేశారు. 332 ఎకరాల ఆయకట్టు కలిగిన మహాసముద్రం గండి పనులు పూర్తికావడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌గా ఉపయోగపడుతుంది. చుట్టూ 20 గ్రామాలకు భూగర్భ జలాలు పెంపొందుతున్నాయి. రైతులకు ఈ రిజర్వాయర్‌తో సాగునీటి సమస్య తీరింది.

ప్రభుత్వంపైనే ఆశలు

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నారు. ఇటీవల ఈ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు కావాల్సిన అవసరాలు, నిధులపై నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మూడురోజుల క్రితం అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మహాసముద్రం రిజర్వాయర్ ప్రదేశాలను టూరిజం శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఇక్కడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుట్టల పై భాగానికి వెళ్లేందుకు కావాల్సిన రహదారి, మహాసముద్రంలో బోటింగ్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. దీంతో సహజ సిద్ధమైన ప్రకృతి సౌందర్యం కలిగి ఉండటమే కాకుండా సర్వాయి పాపన్న సంచరించిన ఈ ప్రదేశం పర్యాటక కేంద్రంగా మారుతుందని ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



సర్వాయి పాపన్న ఏర్పాటు చేసుకున్న కోట గోడ



మహాసముద్రం ప్రాంతాన్ని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



గుట్టల నుంచి వస్తున్న జలపాతం

స్మితా సభర్వాల్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి


- దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ప్రతినిధులు



జోగిపేట: ప్రజావాణిలో తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న దివ్యాంగులు

సిద్దిపేట అగ్రికల్చర్/నారాయణరావుపేట/మిరుదొడ్డి/జోగిపేట, జూలై 22: దివ్యాంగుల పట్ల వివక్షపూరిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్మితా సభర్వాల్ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 92 ప్రకారం నేరమని, సిద్దిపేట దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యాన్వేష్, జనరల్ సెక్రెటరీ పరమేశ్వర్ పాల్గొన్నారు. దివ్యాంగులపై సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు దండు శంకర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులను అవమానపరిచిన సీనియర్ ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. దివ్యాంగులపై ఐఏఎస్ స్మితా సభర్వాల్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై దివ్యాంగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో తహసీల్దార్ భాస్కర్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా కార్యదర్శి మన్నె పోచయ్య, అందోలు డివిజన్ అధ్యక్షుడు సుభాష్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

అల్లం రైతుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అల్లం రైతులు

జహీరాబాద్, జూలై 22: జహీరాబాద్ ప్రాంతంలో అల్లం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో అల్లం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో రైతులు ప్రధాన పంటగా అల్లం తదితరాలను పండిస్తామన్నారు. అయితే హైదరాబాద్ మార్కెట్లోకి కేరళ నుంచి లేత అల్లం తేవడంతో తాము పండించిన అల్లానికి ధర లేకుండా పోతుందన్నారు. రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ మార్కెట్‌కు జూన్, జూలైలో కేరళ నుంచి లేత అల్లం తీసుకురాకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించామన్నారు. ఆయన స్పందించి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారని పేర్కొన్నారు. అయినా కొందరు హైదరాబాద్ మార్కెట్‌కు కేరళ లేత అల్లంను తీసుకురావడంతో తాము పండించిన పంటపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తరలించిన అల్లం పంటను హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తే ప్రస్తుతం క్వింటాలుకు రూ.10 వేలు పలుకుతుందని, ఖర్చులన్నీ పోను రూ.7 వేలు మాత్రమే చేతికి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లం రైతులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి, రాంరెడ్డి, నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి: కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 22: అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తూ.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చేపట్టిన పనులు, పురోగతి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులతోపాటు సంబంధిత శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యటించి లోటుపాట్లను సవరించాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో సమస్యను పరిష్కరించాలని తెలిపారు. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రజలకు సోకకుండా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. మనఊరు-మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులు పూర్తిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కల్చరల్, జూలై 22: మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.రవీంద్రకుమార్ తెలిపారు. ఈనెల 25న ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని, అర్హులైన హాజరుకావాలన్నారు. మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్లు-25, అసోసియేట్ ప్రొఫెసర్లు-28, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-56 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎండీ/ఎంఎస్/డీఎన్బీ, పీజీ డిగ్రీలో సాధించిన మార్కులు, ట్యూటర్ పోస్టులకు ఎంబీబీఎస్‌లో సాధించిన మార్కులు, అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు పరిగణలోకి తీసుకుంటామని ఆర్ఓఆర్‌ను అనుసరిస్తారని తెలిపారు. ట్యూటర్ సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తుదారుడి వయసు 31-03-2025 నాటికి 45 ఏళ్లలోపు ఉండాలన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ.1,90,000 ఉంటుందని, అసోసియేట్ ప్రొఫెసర్ల వేతనం నెలకురూ.1,50,000, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ.1,25,000 ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో 25న హాజరుకావాలని సూచించారు.

అరుదైన నక్షత్ర తాబేలు

- అటవీ అధికారులకు అప్పగింత

సంగారెడ్డి రూరల్, జూలై 22: అరుదైన జాతికి చెందిన నక్షత్ర తాబేలు సంగారెడ్డికి చెందిన రాజుకు సోమవారం లభించింది. దానిని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ఆధ్వర్యంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి వీరేంద్రబాబు సమక్షంలో అటవీ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్‌బెటర్ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి మహేశ్‌కుమార్, సహాయ కార్యదర్శి పాండురంగం, కార్యవర్గ సభ్యుడు సాయి పాల్గొన్నారు.



తాబేలును అటవీ అధికారులకు అప్పగిస్తున్న శ్రీధర్ మహేంద్ర, నక్షత్ర తాబేలు

భూమి ఇవ్వాలని బెదిరింపులు

- న్యాయం కోసం పురుగుల మందు డబ్బాతో రైతుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత రైతుల ధర్నా

రామాయంపేట, జూలై 22: 25 ఏళ్లుగా సాగుచేస్తున్న తమ పట్టా భూమిపై కొందరు వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, అక్రమంగా భూమిని లాక్కునే ప్రయత్నంలో బెదిరిస్తున్నారని బాధిత రైతులు సోమవారం పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ తమ గోడును వెళ్లబోసుకున్నారు. పట్టణంలోని నాలుగు కుటుంబాలకు చెందిన సుమారు 15 మంది గంట పాటు కార్యాలయం ఎదుట బైఠాయించి, అనంతరం తహసీల్దార్ రజినికి వినతిపత్రం అందజేశారు. అన్నివిధాలా పట్టా ఉన్నప్పటికీ.. ఇద్దరు తమదేనంటూ ఇబ్బందులు పెట్టడమే కాకుండా.. పోలీసు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్యాయంగా ఇబ్బందుల పాలుచేస్తే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో ముగిసిన పాఠశాలల ఆడిట్



గాంధీసెంటినరీ హైస్కూల్‌లో నిర్వహించిన ఆడిట్‌కు హాజరైన హెచ్‌ఎంలు

సంగారెడ్డి అర్బన్, జూలై 22: జిల్లాలో రెండురోజుల పాటు నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ఆడిట్ ముగిసింది. ఇందులో భాగంగా సోమవారం సంగారెడ్డిలోని గాంధీసెంటినరీ హైస్కూల్‌లో సంగారెడ్డి, కంది, హత్నూర, కొండాపూర్, సదాశివపేట మండలాలు, జడ్పీ హైస్కూల్‌లో అందోల్, వట్‌పల్లి, పుల్‌కల్, చౌటకూర్, మునిపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఆడిట్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన చార్టెడ్ అకౌంట్స్ అధికారులు ఆడిట్ సజావుగా నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాలల నిర్వహణ నిధుల వినియోగం, ఖర్చు, క్యాష్ బుక్, బిల్స్, వోచర్స్, స్టాక్, అంతేకాకుండా సీఆర్‌సీ, ఎంఆర్‌సీ గ్రాంటు నిర్వహణ నిధులు వినియోగం తదితర వివరాలు, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది ఆడిట్‌లో పాల్గొన్నారు.

బదిలీపై రావడానికి అధికారుల అనాసక్తి

- సిరిసిల్లా జోన్‌లో నర్సాపూర్ ఉండటమే కారణం

నర్సాపూర్, జూలై 22: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధశాఖల్లో బదిలీపై రావడానికి అధికారులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్నిశాఖల్లో సిబ్బంది నుంచి అధికారుల వరకు బదిలీల ప్రక్రియ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో కూడా బదిలీల ప్రక్రియ జరగ్గా.. నర్సాపూర్‌లో పనిచేసిన ఏఈలంతా బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఇక్కడికి ఎవరూ రాలేదు. ప్రస్తుతం పీఆర్ నర్సాపూర్, కౌడిపల్లి సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఏఈలు లేని పరిస్థితి నెలకొన్నది. నర్సాపూర్ సబ్ డివిజన్ పరిధిలో నర్సాపూర్, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో మొత్తం ఏడుగురు ఏఈలు ఉండాల్సి ఉండగా.. నలుగురు బదిలీపై వెళ్లగా.. ఉన్న ఇద్దరిలో ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉండగా.. ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. నర్సాపూర్ పీఆర్ సబ్ డివిజన్ ఇంజనీరింగ్ విభాగంలో ఒక్క డీఈఈ, ఒక్క ఏఈ మాత్రమే ఉన్నారు. అదేవిధంగా కౌడిపల్లి పీఆర్ సబ్ డివిజన్ పరిధిలో పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆ సబ్ డివిజన్ పరిధిలో ఐదుగురు ఏఈలకుగాను.. నలుగురు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఒక్క డీఈఈ, ఒక్క ఏఈ మాత్రమే ఉన్నారు. బదిలీపై వెళ్లినవారి స్థానంలో ఇక్కడికి ఎవరూ రావడం లేదు. దీనికి ప్రధాన కారణం నర్సాపూర్ నియోజకవర్గం ప్రస్తుతం సిరిసిల్లా జోన్‌లో ఉంది. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం సిరిసిల్లా జోన్‌లో ఉండటం వల్ల ఇక్కడికి వచ్చే అధికారులకు, ఇతర ఉద్యోగులకు హైదరాబాద్‌తో ఎలాంటి సంబంధం లేకుండాపోతోంది. ఇక్కడికి బదిలీపై వస్తే ఇక సిరిసిల్లా జోన్ ప్రకారం మెదక్, సిద్దిపేట, కామారెడ్డి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందనే ఉద్దేశంతో అధికారులు బదిలీపై వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఈ ఒక్క కార్యాలయమే కాదు ఇతర శాఖల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా ఈ ప్రాంత ఉద్యోగులు నర్సాపూర్ నియోజకవర్గాన్ని సిరిసిల్లా జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలపాలని కోరుతూనే ఉన్నారు. గత ఎన్నికల సమయంలో కూడా ఆయా పార్టీలకు విన్నపాలు చేశారు. కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న చార్మినార్ జోన్‌కు బదులు ఎక్కడో వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న సిరిసిల్లా జోన్‌లో కలపడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు.



నర్సాపూర్ పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయం

ప్రజావాణికి స్పందన అంతంతే


కంది తహసీల్ కార్యాలయంలో అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

సంగారెడ్డి జిల్లాలో ప్రతీసారి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం మొదటిసారిగా ఆయా మండలాల్లోని తహసీల్ కార్యాలయాల్లో నిర్వహించారు. తొలిసారి ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. కాగా అందిన ఫిర్యాదుల్లో ఎక్కువగా ధరణికి సంబంధించిన సమస్యలే కావడం గమనార్హం. మెదక్ జిల్లాలో ఎప్పటిలాగే తహసీల్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది.

కంది, జూలై 22: మండలకేంద్రమైన కందిలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. మండల పరిషత్, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. తొలిరోజు ప్రజావాణిలో ధరణి సమస్యలపై మూడు దరఖాస్తులు అందాయి. సాధారణ సెలవు దినాలు మినహా ప్రతీ సోమవారం కంది తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు.

● మునిపల్లి: మండల కేంద్రమైన మునిపల్లి ఎంపీడీలో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 5 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు, తహసీల్దార్ తెన్‌మొళి తెలిపారు. రెండు పెన్షన్ కోసం, 3 రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు.

● పుల్‌కల్: పుల్కల్, చౌటకూర్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అత్యధికంగా భూ సమస్యలకు సంబంధించినవే దరఖాస్తులు రావడం విశేషం. సోమవారం ప్రజావాణిలో పుల్కల్ తహసీల్దార్ కార్యాలయానికి 8 దరఖాస్తులు, చౌటకూర్ తహసీల్దారు కార్యాలయానికి 3 దరఖాస్తులు వచ్చాయి.


జహీరాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో ప్రజావాణికి హాజరైన అధికారులు

● జోగిపేట: జోగిపేట తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలి ప్రజావాణిలో 5 ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దారు భాస్కర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, పంచాయత్ రాజ్ డిప్యూటీ ఈఈ జుట్టు క్రిష్ణ, ఎంఈవో బండి క్రిష్ణ, ఎస్‌ఐ పాండు, ఏవో విజయరత్న, ఇరిగేషన్ అధికారి నాగరాజు, ఏఈవో శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

● జిన్నారం: బొల్లారం మున్సిపాలిటీలో అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, ఆర్వో శ్రీధర్, ఇతర అధికారులు పట్టణ ప్రజల నుంచి పలు సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు.

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, పంచాయతీ రాజ్‌విభాగం డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్‌తో పాటు వివిధ శాఖల డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. మొత్తం అయిదు వినతులు వచ్చాయి. కాగా ఖేడ్ పట్టణంలోని మంగల్‌పేట, టీకేఎస్ కాలనీలో కుక్కల బెడదను నివారించాలని కాన్షీరాం అనే వ్యక్తి వినతిపత్రాన్ని అందించాడు.

● కోహీర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బాలశంకర్ తెలిపారు.


నిజాంపేట: ఇళ్ల స్థలాల కోసం ప్రజావాణిలో మెదక్ కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

● జహీరాబాద్: జహీరాబాద్ తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగ తహసీల్దార్ రవీందర్ మాట్లాడుతూ ప్రజా వాణిలో హుగ్గెల్లి, డిడిగి, బూడ్డిపాడ్ గ్రామాలకు చెందిన రైతులు ధరణి సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు చేశారన్నారు. కార్యక్రమంలో వివిధశాఖలకు చెందిన అధికారులు మాధవరెడ్డి, ప్రవీణ, శివకుమార్, జానకిరాం, తదితరులు పాల్గొన్నారు.

● ఝరాసంగం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పలుశాఖల అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 3 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీవో సుధాకర్, వివిధశాఖలకు చెందిన అధికారులు లక్ష్మయ్య, వెంకటేశం బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

● రేగోడు: మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒకే దరఖాస్తు వచ్చిందని తహసీల్దార్ బాలలక్ష్మి తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో సీతారావమ్మ తెలిపారు.

● నిజాంపేట: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు మండలానికి చెందిన జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని సూచించారు.


కొల్చారం: ప్రజావాణిలో అర్జీని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

● కొల్చారం: మండల పరిధిలోని అప్పాజిపల్లిలో గతంలో డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలంలో క్వారీ నిర్వహిస్తున్నందున డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలని పంచాయతీ కార్యదర్శి కొల్చారం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. అప్పాజిపల్లి గ్రామంలో సేకరించిన చెత్త వేయడానికి స్థలం లేకపోవడం వలన ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, ఏవో శ్వేతకుమారి పాల్గొన్నారు.

ప్రజావాణికి కరువైన ఆదరణ


వట్‌పల్లి: ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

వట్‌పల్లి/నాగల్‌గిద్ద, జూలై 22: వట్‌పల్లి, నాగల్‌గిద్ద మండలాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరైనప్పటికీ ప్రజల నుంచి ఒక్క అర్జీ కూడా రాకపోవడం గమనార్హం. అధికారులు ప్రజలకు సరైన అవగాహన కల్పించలేకపోయారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వట్‌పల్లి తహసీల్ కార్యాలయంలో ప్రజావాణికి తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో శశిప్రభ, ఏవో మహేష్, ఎస్‌ఐ సంగమేశ్వర్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా నాగల్‌గిద్ద తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ సతీష్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరైనప్పటికీ ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

గుండ్లమాచునూర్ డంపుయార్డు పనులను అడ్డుకున్న గ్రామస్థులు

హత్నూర, జూలై 22: మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామసమీపంలో సంగారెడ్డి మున్సిపాలిటీ డంపుయార్డు పనులకు ఏర్పాట్లు చేపట్టింది. ఈ విషయం తెలుసుకున్న గుండ్లమాచునూర్ గ్రామ ప్రజలు మున్సిపాలిటీ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చేసిన సర్వే పనులను సైతం అడ్డుకొని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి తిప్పి పంపారు. సోమవారం మరోసారి సంగారెడ్డి మున్సిపాలిటీ సిబ్బంది అక్కడ డంపుయార్డు పనులకు ఏర్పాట్లు చేపట్టగా గ్రామస్థులు పనులను అడ్డుకున్నారు. ఇప్పటికే పరిశ్రమలు కాలుష్యంతో బతకలేకపోతున్నామని, ఇక డంపుయార్డు నిర్మాణం చేపడితే ఎలా అని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు డంపుయార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేదా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.


పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలి


చిన్నశంకరంపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట, జూలై 22: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మెదక్ జిల్లా అసిస్టెంట్ లీగల్ అథారిటీ కౌన్సెలింగ్ సిద్దుగౌడ్ సూచించారు. ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీంలకు సమాచారం అందించాలని అన్నారు. చిన్నశంకరంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం షీటీం, ఐసీడీఎస్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు అనుకోని సంఘటనలు జరిగినపుడు 100 డయల్ కాల్ చేసి పోలీసుల రక్షణ పొందాలన్నారు. కొత్త చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. చైల్డ్, బేటి బచావో బేటి పడావో, చట్టాలు, ఆరోగ్యం, విద్యా తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సేవ్ చిల్డ్రన్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, ప్రధానోపాధ్యాయులు దీప్లా నాయక్, భరోసా సపోర్టు పర్సన్ మంజుల, మిషన్ శక్తి కోఆర్డినేటర్ సంతోషి, షీటీం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాసాయిపేటలో తపస్ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న తపస్ నాయకులు

మాసాయిపేట, జూలై 22: మండలంలోని కొప్పులపల్లి, మాసాయిపేట మండల కేంద్రాల్లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నరేష్ మాట్లాడుతూ.. డీఏ బకాయిలతో పాటు సరెండరు లీవుల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు రంగారెడ్డి, బాలమణి ధర్మపురి పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల ప్రవాహంపై ఫిర్యాదు

జిన్నారం, జూలై 22: కాజీపల్లి పరిధిలో పరిశ్రమల రసాయన వ్యర్థాల ప్రవాహంపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం జేఏసీ అధ్యక్షుడు రమాకాంత్ పీసీబీ ఈఈ, ఇతర అధికారుల కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారిగా అనీల్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జూలై 22 : జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారిగా పి.అనీల్ కుమార్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా వనపర్తి జిల్లా నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన జిల్లా ఉపాధి కల్పన అధికారి వందన హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అదే విధంగా జేఈవో రాధిక మేడ్చల్ జిల్లాకు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న జేఈవో నిర్మల సంగారెడ్డి జిల్లాకు జేఈవోగా వచ్చి విధుల్లో చేరారు.

11వ రోజుకు రైతుల దీక్ష

నర్సాపూర్, జూలై 22: రైతులు సంగారెడ్డి కెనాల్‌కు భూములు ఇవ్వబోమంటూ చేపట్టిన దీక్ష సోమవారం 11వ రోజుకు చేరింది. దీక్షలో రైతులు శ్రీకాంత్‌రెడ్డి, కిషన్‌నాయక్, అంజాగౌడ్, నర్సింహారెడ్డి, అంజయ్య, పోచయ్య, తుక్కయ్య ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సంగారెడ్డి అర్బన్, జూలై 22 : సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 23 న ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ-ఫీడర్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని రామ్‌నగర్, శ్రీనగర్, కిందిబజార్, బ్రాహ్మణవాడ, నలందానగర్, మాధవనగర్, హనుమాన్ నగర్, కట్టకొమ్ము ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్లా

సంగారెడ్డి అర్బన్, జూలై 22 : పీఆర్టీయూ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా మహ్మద్‌అబ్దుల్లా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

బాలికల ఉన్నత పాఠశాలలో శిక్ష సప్త

పెద్దశంకరంపేట, జూలై 22: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయాపాఠశాలల్లో సోమవారం శిక్ష సప్త కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దశంకరంపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటేశం పాల్గొని టీఎల్‌ఎం మేళాను పరిశీలించారు.

నాగసన్‌పల్లి ఉన్నత పాఠశాలలో..

పాపన్నపేట, జూలై 22: జాతీయ విద్యావిధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మండలంలోని నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న సామగ్రిని ఉపయోగించి అన్ని సబ్జెక్టుల్లో టీఎల్‌ఎం తయారు చేసి ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం పాల్గొని ప్రదర్శనలను తిలకించి ఉపాధ్యాయులను అలాగే విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ టీఎల్‌ఎం లను ఉపయోగించుకొని తరగతి వారీగా కనీస సామర్థ్యాలు సాధించి మెరుగైన ఫలితాలు పొందాలని విద్యార్థులకు సూచించారు.

మెట్రోవాటర్ వర్క్స్‌లో నిధుల కొరత

● స్పష్టం చేసిన మెట్రో ఎండీ ● సమస్యలు ఎలా పరిష్కరించాలంటూ కార్పొరేటర్ల అసహనం

పటాన్‌చెరు, జూలై 22: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు మెరుగైన మంచినీటి సరఫరాకు మౌలిక వసతుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, సివరేజ్ బోర్డు ఎండీకి కార్పొరేటర్లు వినతిపత్రాలు ఇవ్వగా అసలు బోర్డులో నిధులు లేవని తేల్చిచెప్పడంతో కంగుతిన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో తాగునీటి మరమ్మతులు, పైపులైన్ల పునరుద్ధరణ పనులకు రూ. కోటి11లక్షల నిధులు అవసరమని, మంజూరు చేయాలని మెట్రో ఎండీ అశోక్‌రెడ్డికి పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ సోమవారం విజ్ఞప్తి చేశారు. డివిజన్‌పరిధిలోని సీతారాంపురం, గోకుల్ నగర్, శాంతినగర్, చైతన్యనగర్, శ్రీరాంనగర్, జేపీకాలనీ, శిశుమందిర్, బండ్లగూడా తదితర కాలనీల్లో తాగునీటి మౌళిక వసతులు, డ్రైనేజీల ఏర్పాటు కోసం ఏడాది కాలంగా నిధులు మంజూరు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కాగా బోర్డులో నిధులు లేవని ప్రస్తుతం పైసా ఇచ్చే పరిస్థితి లేదని ఎండీ చెప్పడంతో కార్పొరేటర్ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఉన్న నిధులన్నీ మూసీనదిపై ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం కోసం వెచ్చించాలని ప్రభుత్వం ఆదేశించడంతో డివిజన్లకు నిధులు మంజూరు చేసే పరిస్థితి లేకుండా పోయిందని నిస్సహాయత వ్యక్తం చేశారు. దీనికి తోడు బిల్లులు వసూలు చేయకుండా ఫ్రీ నీటి సరఫరాతో బోర్డు ఆదాయం పడిపోయిందని జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నామని పలు డివిజన్ల కార్పొరేటర్ల ఎదుట ఎండీ నిస్సహాయత వ్యక్తం చేశారని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన పటాన్‌చెరులో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమైన తాగునీరు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. ప్రజల నుంచి పన్నులు చేస్తున్నప్పుడు వారికి మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తక్షణం హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు.


మెట్రోవాటర్ వర్క్స్ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి రమేష్

జహీరాబాద్, జూలై 22: విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకుని అందుకు అనుగుణంగా కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి రమేష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిష్పత్తి, సమానత్వం, భవిష్యత్తు ప్రణాళిక, హెల్ప్‌లైన్ నెంబర్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ మాట్లాడుతూ సమాజంలో మహిళల ప్రాధాన్యత, యువత జీవనైపుణ్యాలు, విద్య, ఉద్యోగం, సైబర్‌క్రైం, సోషల్‌మీడియా దుర్వినియోగం, మాదకద్రవ్యాల నిర్మూలన, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. అలాగే పట్టణంలోని తపస్య జూనియర్‌కళాశాలలో కూడ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జూనియర్‌కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, సీడీపీవో సునిత, మహిళాసాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సిబ్బంది విశాల, ఫిరమాల్ ఫౌండేషన్ సభ్యులు అశ్విని, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు పలు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.


కళాశాల ఆవరణలో మొక్కను నీరుపడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి రమేష్ తదితరులు

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి


చేగుంట: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఓబీసీ నాయకులు

చేగుంట జూలై 22: బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఓబీసీ మోర్చా నార్సింగి మండల శాఖ అధ్వర్యంలో సోమవారం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా బీజేపీ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు స్వామి, పట్టణ శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందని బీజేపీ మండలాధ్యక్షుడు రాజు విమర్శించారు. సోమవారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు శంకర్, బీజేపీ మండలాధ్యక్షుడు దశరథం, మహేష్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● టేక్మాల్: తెలంగాణ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో టేక్మాల్ మండల తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో42శాతం రిజర్వేషన్ అమలయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్, జిల్లా కార్యదర్శి సభ్యులు ఎల్లుపేట రాజు, ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు, ఉపాధ్యక్షుడు వడ్డె రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● అల్లాదుర్గం: బీసీ డిక్లరేషన్ ను తక్షణమే అమలు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా నాయకులు కంచరి బ్రహ్మం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలసి సోమవారం అల్లాదుర్గం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాళ్లరాములు బీజేపీ మండల ప్రధానకార్యదర్శులు సాయిలు, రమేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

● పాపన్నపేట: కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని భాజపా మండలాధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మార్వో లక్ష్మణ్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట నాయకులు చంద్రయ్య, రాజ్‌కుమార్, శివాజీ, ప్రవీణ్, విష్ణు, బాగేశ్, తదితరులున్నారు.

● నిజాంపేట: బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా పిలుపు మేరకు బీసీ డిక్లరేషన్‌పై సోమవారం తహసీల్దార్ సురేష్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెల్పుల సిద్ధరాములు, శ్రీనివాస్ గౌడ్, రాగి రాములు నాయిని ప్రసాద్, ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● తూప్రాన్: కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తూప్రాన్ తహసీల్దారు విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భూమన్నగారి జానకిరాంగౌడ్, ఉపాధ్యక్షుడు పోతరాజు నాగరాజు, మధుసూదన్, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్, జూలై 22: బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ ముసాదిక్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ మండల ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, ఓబీసీ మండల అధ్యక్షుడు నగేష్ రాజు తదితరులు ఉన్నారు.

కొల్చారం పాఠశాలను సందర్శించిన డీఈవో

కొల్చారం, జూలై 22: శిక్షా సప్త వారోత్సవాల్లో భాగంగా కొల్చారం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను డీఈవో రాధాకిషన్, ఎంఈవో నీలకంఠం సోమవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని డీఈవో సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సఫియా బేగం, బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ 'ఏ' గ్రూపులో చేర్చాలి


సంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

సంగారెడ్డి టౌన్, జూలై 22: తమ కులస్తులను బీసీ డీ గ్రూపులో నుంచి ఏ గ్రూపులోకి మార్చాలని ముదిరాజులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ముదిరాజు మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సపాన్‌దేవ్ అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ క్రాంతి వల్లూరును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, ముదిరాజ్ నాయకులు గోపన్నగారి చంద్రశేఖర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కుంగ్‌పూలో రాణించిన విద్యార్థులు


హైదరాబాద్ కోట్లవిజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, జూలై 22: ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21న నిర్వహించిన చాంపియన్‌షిప్‌లో ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా దేశాలకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనగా సదాశివపేటకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. సంగారెడ్డి జిల్లాకు 20 బంగారు, 15 వెండి, 10 బ్రాంజ్ మెడల్స్ లభించాయి. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ ఎండీ సాజిద్, మాస్టర్లు ఎండీ షఫీ, ముజీబ్, అశోక్, జహీరుద్దీన్, చిన్న, కోటి, నవీద్, సమీర్, అయాజ్ పాల్గొన్నారు.

'కుక్కల బెడద నుంచి కాపాడండి'

కోహీర్, జూలై 22: కుక్కల బెడద నుంచి గ్రామ ప్రజలను కాపాడాలని కోరుతూ సోమవారం మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోహీర్ గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. చిన్న పిల్లలు, పెద్దవాళ్లు అనే తేడా లేకుండా అందరినీ కరుస్తున్నాయని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ సర్వర్ ఫిర్దోస్, షహబాజ్, హద్నన్, నవాజ్, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలకు వెళ్లాలి

● రాష్ట్ర ఉద్యోగ సంఘాల ప్రధాన కార్యదర్శి పాండు

సంగారెడ్డి రూరల్, జూలై 22: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ఉద్యోగ సంఘాల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో కులగణన సాధన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించిన హామీ మేరకు ఇప్పటికే రాష్ట్ర క్యాబినెట్‌లో, అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. ఇందుకనుగుణంగా జీవో 26 తీసుకువచ్చి రూ. 150 కోట్లు బడ్జెట్ కేటాయించిందని, ఈ ప్రక్రియను బీసీ సంఘాలు స్వాగతిస్తున్నా యన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే కులగణన ప్రక్రియ ప్రారంభమైందని, కానీ ఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం ముగిసినందున స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకముందే రాష్ట్రంలో కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, యువజన సంఘం జిల్లా యూఐత్ కన్వీనర్ రమేష్, కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్లన్న, ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నిఖిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

నిజాంపేట, జూలై 22: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సాంస్కృతిక సారథి కళాకారులు పాటలు రూపంలో అవగాహన కల్పించారు. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో సోమవారం కళాకారులతో పాటల రూపంలో అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ బడుల అవశ్యకతను వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని పేర్కొన్నారు. కళాకారులు సిద్దులు, ఎల్లయ్య, కృష్ణ, విజయలక్ష్మి, శేఖర్, ఎల్లం, దేవదాస్, నర్సింలు, రామారావు పాల్గొన్నారు.

'సురక్షిత ఆటో ప్రయాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి'

జిన్నారం, జూలై 22: ఆటో ప్రయాణికుల రక్షణ కోసం మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమాన్ని జిన్నారం పోలీసులు ప్రారంభించారు. సోమవారం జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుధీర్‌కుమార్, ఎస్‌ఐ నాగలక్ష్మి, సిబ్బంది స్థానిక ఆటో డ్రైవర్లకు స్టిక్కర్లను అందజేశారు. ప్రయాణికుల భద్రతకు ఆటో డ్రైవర్లు ప్రాధాన్యం ఇవ్వాలని సీఐ, ఎస్‌ఐలు పేర్కొన్నారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురైతే స్టిక్కర్‌పై ఉండే క్యూ ఆర్ కోడ్ ద్వారా సమాచారాన్ని అందించవచ్చని వారు తెలిపారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం


మాద్వార్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, జూలై 22: మండలంలోని మాద్వార్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు సోమవారం వీడ్కోలు, స్వాగత కార్యక్రమాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన బాపుశెట్టి, గోమ్యా, నీల్యా, రవీందర్‌లకు వీడ్కోలు పలుకడంతో పాటు నూతనంగా పాఠశాలకు వచ్చిన గురునాథ్, శివలకు స్వాగతంపలికారు.

● చిన్నశంకరంపేట, జూలై 22: మండలంలోని చందంపేట హైస్కూల్ ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో సోమవారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బదిలీపై హైస్కూల్ వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికి, బదిలీపై ఇక్కడికి వచ్చిన ఉపాధ్యాయులకు విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీలత స్వామిరాజ్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జాకీర్ హుస్సేన్

జహీరాబాద్, జూలై 22: జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జాకీర్‌హుస్సేన్ సోమవారం పదవీబాధ్యతలను చేపట్టారు. ఆయనకు ఆర్టీసీ సిబ్బంది పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా డిపోకు చెందిన మేనేజర్ జహీరాబాద్‌కు బదిలీపై వచ్చారు.

'సంఘటితంగా ఉంటేనే సమస్యల పరిష్కారం'

జహీరాబాద్, జూలై 22: సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు, ఎల్‌ఐసీ ఏజెంట్ల రాష్ట్ర నాయకుడు రామస్వామి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అతిథి-ఇన్‌లో ఎల్‌ఐసీ ఏజెంట్ల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నియోజక వర్గం నూతనకార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎల్‌ఐసీ ఏఏజెంట్ల నియోజకవర్గ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విఠల్‌గౌడ్, ప్రధానకార్యదర్శిగా తేజీరెడ్డి, ట్రెజరర్‌గా పోలీస్ ప్రవీణ్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

పెద్దశంకరంపేట, జూలై 22: మండలంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులపై సోమవారం ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీలో చేపట్టే వివిధ రకాల పనులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు కార్యక్రమంలో ఏపీవో నవాజుద్దిన్, టీఏలు స్వాతి, వినోద, సిబ్బంది ఉపేందర్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

చిన్నశంకరంపేట, జూలై 22: మండల కేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలోని సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లలు బాల్యదశలో అన్ని రకాల సమగ్ర అభివృద్ధితో పాటు పోషకాహారం అంగన్‌వాడీల్లో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ నాగమణి, అంగన్వాడీ టీచర్లు మాలతి, నాగరాణి, జ్యోతి, రాణి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.